పామిడి తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న పేదలు

కాంట్రాక్టరు, అధికారుల మధ్య సత్యసాయి వాటర్ వర్కు కార్మికులు నలిగిపోతున్నారు. 17 నెలలుగా వారికి రావాల్సిన గ్రాట్యుటీ చెల్లించలేదు. ఈ సమస్యను అధికారులు కాంట్రాక్టర్‌పైనా, కాంట్రాక్టరు అధికారులపైనా చెబుతున్నారు. ఇలా ఇద్దరి మధ్య కార్మికులు నలిగిపోతున్నారు. ఈ సమస్యల పరిష్కారంపై గత కొన్ని రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా అధికారులు పట్టించుకునే పరిస్థితుల్లో లేకపోవడం శోచనీయం. కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారంపై కూడా అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుండడంపై కార్మిక సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అనంతపురం కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు

'సత్యసాయి'

కార్మికులతో చెలగాటం..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సత్యసాయి బాబా వాటర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారు. పూర్తయిన తరువాత 1998లో సత్యసాయి బోర్డును ఏర్పాటు చేశారు. దీనికి జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. కలెక్టర్ ఆధ్వర్యంలో సత్యసాయి వాటర్ వర్క్సు నిర్వహణ నడుస్తూ వచ్చింది. దీని కాంట్రాక్టర్‌గా ప్రారంభం నుంచి ఎల్అండ్‌టి సంస్థ వ్యవహరిస్తూ వచ్చింది. ఈ సంస్థ 2021 జూన్ నెల నుంచి కాంట్రాక్టు నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకుంది. అయితే నిర్వహణ ప్రారంభమైనప్పటి నుంచి 572 మంది కార్మికులు ఈ సంస్థలో పనిచేస్తూ వచ్చారు. ఇందులో కొంత మంది చనిపోగా, మరికొంత మంది వయసురీత్యా ఉద్యోగ విరమణ పొందారు. ఎల్అండ్‌టి సంస్థ కాంట్రాక్టు బాధ్యతల నుంచి తప్పుకోవడంతో కార్మిక చట్టాల ప్రకారం వారి సీనియార్టీని బట్టి గ్రాట్యూటీని చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ గ్రాట్యూటీని ఎల్అండ్‌టి ఇప్పటికీ చెల్లించలేదు. దీన్ని చెల్లించాలని కార్మికులు గత కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు.

ఒకరిపై ఒకరు

గ్రాట్యుటీని చెల్లించాలని కార్మికులు కాంట్రాక్టు సంస్థ అయిన ఎల్అండ్‌టీని కోరారు. అయితే ఎల్అండ్‌టి సంస్థ తమకు ప్రభుత్వం నుంచి ఇంకా రూ.32 కోట్ల బిల్లులు రావాల్సి ఉందని, అందులో గ్రాట్యూటీకి చెల్లించాల్సింది గరిష్ఠంగా పది కోట్లలోపే ఉంటుంది. అది పట్టుకుని తక్కిన మొత్తాన్ని తమకు చెల్లించాలని అధికారులకు విజ్ఞప్తి చేసియున్నామని చెబుతున్నారు. అధికారులేమో ముందుగా గ్రాట్యూటీ కార్మికులకు చెల్లిస్తే బిల్లులు చెల్లిస్తామని చెబుతున్నారు. ఈ రకంగా ఇద్దరి మధ్య పితలాటకం నడుస్తోంది. సమస్య పరిష్కారానికి జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సమ్మె విరమించం

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు

అనంతపురం కలెక్టరేట్ : శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికులకు బకాయి వేతనాలు, గ్రాట్యూటీ డబ్బులు ఇచ్చేంత వరకు సమ్మె విరమించేది లేదని సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారం 10వ రోజుకు చేరుకుంది. అందులో భాగంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ పిలిపించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. గ్రాట్యూటీ డబ్బులకు సంబంధించి ఖచ్చితమైన సమాధానం చెప్పకపోవడంతో కార్మికులు తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. అక్కడే రెవెన్యూభవన్ ఆవరణంలో బైటాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు మాట్లాడుతూ ఎల్అండ్‌టి కంపెనీ ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ వద్ద కార్మికులకు రావాల్సిన రూ.32 కోట్ల గ్రాట్యూటీ డబ్బు ఉందని దానిని తీసుకోవాలంటూ చెబుతుంటే, అధికారులు మాత్రం కంపెనీ వారు ఆ విధంగా లేఖ ఇవ్వాలంటూ మెలిక పెట్టారన్నారు. ఇద్దరిని కలిపి సమస్య పరిష్కరించాల్సిన బాధ్యత కలెక్టర్‌కు ఉందన్నారు. తక్షణమే గ్రాట్యూటీ అందేలా చూడాలన్నారు. లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మెలో భాగంగా అవసరమైతే జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధం అవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ అధ్యక్షులు తిప్పేస్వామి, కార్యదర్శి ఎన్.మహబూబ్‌బాషా, కోశాధికారి శ్రీరాములు పాల్గొన్నారు.

నిర్వహణ ముక్కలు చేసేందుకు కుట్ర..?

రెండు దశాబ్ధాలుగా నిర్వహణ బాధ్యతలు చేపడుతున్న కాంట్రాక్టు సంస్థ అయిన ఎల్అండ్‌టి తప్పుకోవడం వెనుక కూడా పెద్ద రాజకీయపరమైన ఒత్తిళ్లే ఉన్నట్టు ఆరోపణలున్నాయి. నియోజకవర్గాల వారీగా నేతలు ఒత్తిళ్లతోనే ఆ సంస్థ నిర్వహణ నుంచి తప్పుకున్నారన్న ప్రచారం సాగుతోంది. 2021లోనే ఈ ప్రయత్నాలు సాగినప్పటికీ ఆరోపణలు రావడంతో వెనక్కు తగ్గారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి నియోజకవర్గాల వారీగా నిర్వహణ బాధ్యతలను చేపట్టే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

ఇద్దరి మధ్య కార్మికులు నష్టపోతున్నారు ...

అటు కాంట్రాక్టర్, ఇటు అధికారుల మధ్య కార్మికులు నష్టపోయే పరిస్థితి నెలకొంది. కాంట్రాక్టు నుంచి ఎల్అండ్‌టి సంస్థ తప్పుకున్నందున ఆ సంస్థ చెల్లించాల్సిన గ్రాట్యూటీని చెల్లించాలని కోరుతూ గత కొన్ని రోజులుగా కార్మికులు ఆందోళనలు చేపడుతున్నారు. గ్రాట్యూటీ చెల్లించి సమ్మె విరమింపజేయాలని అధికారులను కోరుతున్నా, పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని కోరుతున్నాం. లేకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తాం.

జి.ఓబులు,
గౌరవ అధ్యక్షులు శ్రీ సత్యసాయి వాటర్ సప్లయ్ వర్కర్సు యూనియన్.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు

చేతులు రావా..?

◆అధికారులు స్పందించి పట్టాలు ఇవ్వాలి
◆సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్
◆పామిడి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-పామిడి

ఏళ్ల తరబడి సొంత ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అధికారులకు చేతులు రావా అని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ప్రశ్నించారు. పామిడి పట్టణంలో ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో పేదలతో కలిసి పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ పామిడి పట్టణంలో సొంత ఇళ్లు లేని పేదలు అనేక మంది ఉన్నారన్నారు. ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారన్నారు. అయినా ఎవరూ స్పందించలేదని తెలియజేశారు. ఇటీవల పేదలు పట్టణ సమీపంలోని టిడ్కో నివాసాల వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని గుడిసెలు వేసుకున్నారని చెప్పారు. అయితే నాలుగు రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో అధికారులు ఆ గుడిసెలను జెసిబిలతో తొలగించారన్నారు. అధికారులు పట్టాలు ఇవ్వకపోగా, పేదలు వేసుకున్న స్థలాల్లోకి వారిని రానీయకపోవడం దుర్మార్గం అన్నారు. బడా పెట్టుబడిదారులకు వేల ఎకరాలను దారాధత్తం చేసే అధికారులు పేదలకు సెంటు స్థలం ఇవ్వమంటే మాత్రం నిబంధనలు అడ్డు వస్తున్నాయని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పామిడిలో ఇళ్లలేని నిరుపేదలు అందరికీ తక్షణం ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే పేదల పక్షాన సిపిఎం పెద్దఎత్తున పోరాటం చేస్తుందని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ పామిడిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అధికారులకు 15 రోజులు సమయం ఇస్తున్నామని, ఆలోపు ఇవ్వకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, అనిమిరెడ్డి, లక్ష్మినారాయణ, ప్రసాద్‌తో పాటు పేదలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నగరంలో పాదయాత్ర చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

వరద బాధితులను ఆదుకోవాలి

సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అకాల వర్షాలు, వరదలతో నష్టపోయిన బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం నగర 1వ కమిటీ ఆధ్వర్యంలో యువజన కాలనీ, హనుమాన్ కాలనీ, 6వ రోడ్డు, 5వ రోడ్డు, రంగస్వామినగర్, ముత్యాలమ్మ ఆలయం వరకూ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనంత వర్షాలు కురిశాయని, వరద బీభత్సం సృష్టించి కాలనీలు నీట మునిగాయని తెలిపారు. ఆయా కాలనీ ప్రజలు ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఏమాత్రం సహాయం అందించకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ. 2 వేలు కూడా కొందరికి అందలేదన్నారు. వరద బాధితులను ఆదుకోవడంలో కూడా రాజకీయ పార్టీల పేరుతో వివక్ష చూపడం సరికాదన్నరు. మురుగు అంతా ఆయా కాలనీల్లో పేరుకుపోయి ఉన్నా తొలగించని పరిస్థితి ఉంది. దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. అలాగే నడిమివంక చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరారు. దాదాపు 18 కుటుంబాలు పట్టాలు ఇవ్వాలని కోరారు. పట్టాలు ఇస్తే ఇళ్లను ఎత్తుచేసుకుని ఇలాంటి ప్రమాదాలకు గురి కాకుండా కాపాడుకునేవారమంటూ వాపోతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే రూ.2 లక్షలు బాధిత కుటుంబాలకు సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ముస్కిన్, వెంకటనారాయణ, నగర నాయకులు ప్రకాష్, వలి, వెంకటేశు, ప్రసాద్, బాలకష్ణ, మసూద్, చికెన్ నారాయణస్వామి, ఎన్టీఆర్ సీనా, శివ, సాంబ, వెంకటేశు, రాజు, రామాంజి, గఫూర్, వన్నూరప్ప, నారాయణమ్మ, లక్ష్మీదేవి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రాచానపల్లి సచివాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, ప్రజలు

దర్గాకొట్టాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కొడిమి పంచాయతీ పరిధిలో ఉన్న దర్గా కొట్టాల కాలనీ ప్రజలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం అనంతపురం రూరల్ పరిధిలోని రాచానపల్లి సచివాలయం కాలనీవాసులు సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ నగరానికి వచ్చి వెళ్లే బ్రిడ్జి రాచన పల్లి దగ్గర పాడైపోవడంతో నెలరోజులుగా కాలనీవాసులకు రోడ్డు సౌకర్యం లేక కూలీలకు పనులు లేక, ఆటో కార్మికులు, విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాచానపల్లి దగ్గర ఉన్న బ్రిడ్జిని బాగు చేయాలని కోరారు. సచివాలయ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, రాచానపల్లి సర్పంచ్ అంజియాదవ్ వచ్చి ఈ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. అక్కడి నుంచి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. రెండు మూడు రోజుల లోపల ఈ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఎమ్మెల్యే హామి ఇవ్వడంతో నాయకులు, ప్రజలు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు ఎన్టీఆర్ సీన, రాజు, ఆటో యూనియన్ నాయకులు శివ, రామాంజి, కాలనీవాసులు కృష్ణవేణి, రాజు, ధనలక్ష్మి, శ్రీదేవి, మాబు, నాగార్జున, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జన్‌ధన్ ఖాతాలు ప్రారంభం

కళ్యాణదుర్గం : శెట్టూరు మండల కేంద్రంలోని పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జన్‌ధన్ యోజన అకౌంట్లను సోమవారం ప్రారంభించారు. ఈమేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు లాల్‌స్వామి, గోవిందరాజులు సహకారంతో అకౌంట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఇంకా ఎవరైనా జన్‌ధన్ అకౌంట్లు చేయించుకోవాలనుకుంటే కళ్యాణదుర్గంలోని ప్రభుత్వ ఇంటర్ కళాశాలకు వెళ్లే రహదారిలో రాఘవేంద్ర హోటల్ పక్కన ఉన్న రాజు మీసేవ కేంద్రంలో ఓపెన్ చేయనున్నట్లు తెలిపారు. అకౌంట్ ఓపెన్ చేయడానికి తల్లి, తండ్రి ఆధార్ కార్డు, విద్యార్థి బర్త్ సర్టిఫికెట్ తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పే పాయింట్ జిల్లా మేనేజర్ సుగేపల్లి విజయ్‌కిషోర్, బోయ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో గంగపూజ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

జలకళతో రైతుల కళ్లల్లో ఆనందం

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-రాప్తాడు

ఇటీవల కురుస్తున్న వర్షాలతో నియోజకవర్గంలోని చెరువులు, కుంటులు పొంగి పొర్లుతుండటంతో రైతులు, ప్రజల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం మరువ పారుతున్న మండలంలోని చెర్లోపల్లి చెరువులో గంగపూజ ఎమ్మెల్యే గంగపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 40 ఏళ్లుగా నిండని చెర్లోపల్లి చెరువు జగన్ వచ్చిన తర్వాత మరవ పారుతోందన్నారు. దాదాపు 280 ఎకరాలు మునక ఉన్న పెద్ద చెరువు అన్నారు. ఇలాంటి చెరువు నిండి మరవ పారుతోందంటే రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇదే కదా రాజన్న రాజ్యం అని అన్నారు. ప్రతి చెరువుకూ నీళ్లొస్తున్నాయి, ప్రతి కాలువలో నీరు పారుతోంది.. ప్రతి రైతు కళ్లల్లో ఆనందం కనిపిస్తోందన్నారు. అలాగే పేరూరు డ్యాంలో పుష్కలంగా నీళ్లున్నాయన్నారు. 40 నెలల జగనన్న ప్రభుత్వ పాలనలో 30నెలలు పాటు పిఎబిఆర్ కుడికాలవ, హంద్రీనీవా కాలువలు ప్రవహిస్తున్నాయన్నారు. ఇదేవిధంగా భగవంతుడు మళ్లీ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చిట్రెడ్డి జయలక్ష్మి సత్యనారాయణరెడ్డి, జడ్పిటిసి పసుపుల హేమావతి ఆదినారాయణ, ఎంపిటిసి బోగే లక్ష్మీదేవి, బీసీ సెల్ నరసింహగౌడ్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గోపాల్‌రెడ్డి, సింగారప్ప, శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

9 నుంచి క్రీడాకారుల ఎంపిక

రాప్తాడు : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న క్రీడా సంబరాలకు ఈనెల 9, 10వ తేదీల్లో క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి మల్లికార్జున సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో నివసిస్తూ 17 సంవత్సరాలు పైబడిన పురుషులు, మహిళలు వాలీబాల్, కబడ్డీ క్రీడా ఎంపికల్లో పాల్గొనవచ్చున్నారు. అదేవిధంగా పురుషులు క్రికెట్ ఎంపికలో పాల్గొనవచ్చున్నారు. 10న ఆర్డీటీ క్రీడా మైదానంలో క్రికెట్ క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పాల్గొనాలనుకునే క్రీడాకారులు జగనన్న స్పోర్ట్స్ క్లబ్‌లో తమ పేరును రిజిస్టర్ చేసుకుని ఆధార్ కార్డు తీసుకుని హాజరు కావాల్సిందిగా కోరారు.

అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ నాగలక్ష్మికి విద్యార్థి సంఘాల నేతల వినతి

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యార్థుల స్కాలర్‌షిప్, రుసా నిధుల్లో అవినీతికి పాల్పడిన ఎస్ఎస్‌బిఎన్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థుల ట్యూషన్ ఫీజు, రీయింబర్స్‌మెంట్ ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను ఎస్ఎస్‌బిఎన్ కళాశాల యాజమాన్యం రూ.3,12,77,497 కోట్లు దుర్వినియోగం చేసిందన్నారు. విచారించి చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు సూర్యచంద్ర యాదవ్, పరమేష్, పృధ్వీ, సురేష్‌లు విజ్ఞప్తి చేశారు. వివిధ సమస్యలపై జిల్లా నలుమూలల నుంచి వచ్చి ప్రజల నుంచి మొత్తం 451 అర్జీలు వచ్చాయి. శిల్పారామంలో పని చేస్తున్న స్వీపర్స్, సెక్యూరిటీగార్డ్స్ తదితర కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని సిఐటియు ఆధ్వర్యంలో విన్నవించారు. సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ మాట్లాడుతూ 25 మంది కార్మికులు 9 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఆప్కాస్‌లో చేర్చామంటూ చెబుతూ కార్మికులకు వస్తున్న సంక్షేమ పథకాలు కోత విధించారు. కానీ వేతనాలు మాత్రం రూ.8 వేలు ఇస్తున్నారు. కలెక్టర్ నిర్ణయించిన మేరకు కనీసం డైలీ వేజ్ కింద రూ.590 ప్రకారం చెల్లించాలన్నారు. ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్ పోస్టులను నిలుపుదల చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శకుంతల, రమాదేవి, కోశాధికారి జమునలు కలెక్టర్‌కు విన్నవించారు. గ్రేడ్-2 సూపర్‌వైజర్‌ల రాత పరీక్షల్లో అక్రమాలు జరిగాయని అనేక మంది కార్మికులు కోర్టుకు వెళ్లారు. కోర్ట్ తీర్పు రాకమునుపే ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్‌లను నియమించడం సరికాదని, తక్షణమే నిలిపి వేయాలని, శాశ్వత సూపర్‌వైజర్‌లను నియమించాలని కోరారు. గార్లదిన్నె మైనార్టీ రెసిడెన్సియల్ స్కూల్లో సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని తండ్రి చాంద్‌బాషా మాట్లాడుతూ విద్యార్థులకు తగినంత గదులు, సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేగాకుండా రోగాల బారిన పడుతున్నారని వాపోయారు. వెంటనే పరిశీలించి కనీస సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. భూ పంపిణీ చేయాలని ప్రజా సంఘాల నేతలు తిరుపాల్ విజ్ఞప్తి చేశారు.

జెసిబి ద్వారా చదును చేస్తున్న గ్రామ కంఠం భూమి

గ్రామకంఠం భూమి కబ్జా

గుత్తి : మండలంలోని చెర్లోపల్లి పంచాయతీ పాత చెంద్రాయునిపల్లి గ్రామంలోని గ్రామ కంఠం భూమి ఆక్రమణకు గురవుతోంది. గిరిజన గురుకుల బాలుర పాఠశాల సమీపంలో సర్వే నంబర్ 285లో 2.80 ఎకరాల గ్రామ కంఠం భూమి ఉంది. ఆ భూమిని శ్రీ సంత్ సేవాలాల్ చారిటబుల్ ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవ నాయక్ ఆక్రమించేందుకు రెండు రోజులుగా జెసిబి ద్వారా చదును చేస్తున్నారు. పిచ్చి మొక్కలు, ముళ్లపొదలను తొలగిస్తూ శుభ్రం చేస్తున్నారు. గ్రామ భవిష్యత్తు అవసరాల నిమిత్తం ఆ భూమి ఉండగా శ్రీ సంత్ సేవాలాల్ చారిటబుల్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు కేశవ నాయక్ కబ్జా చేస్తున్నాడని సర్పంచి ఎ.వెంకటేష్ తెలిపారు. గ్రామ కంఠం భూమి ఆక్రమణపై తహశీల్దార్ ఎస్.మహబూబ్ బాషా, సిఐ ఎం.వెంకటరామిరెడ్డి లకు సర్పంచి సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామ కంఠం భూమిని పరిరక్షించాలని కోరారు.

ఎంసిఎ 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు అక్టోబర్ -2022లో నిర్వహించిన ఎంసిఎ నాల్గవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను సోమవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య ఇ. కేశవరెడ్డి, కంట్రోలర్ ఆచార్య బి.చంద్రమోహన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం జెఎన్‌టియుఎ వెబ్‌సైట్ హెచ్‌టిటిపి://జెఎన్‌టియుఎరిజల్ట్స్.ఎసి.ఇన్‌ను సంప్రదించాలని కోరారు.

వాలీబాల్ జట్టు ఎంపిక

నార్పల : జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా నార్పల మండల కేంద్రంలోని క్రీడా వికాస కేంద్రం మైదానంలో శింగనమల నియోజకవర్గం వాలీబాల్ టీం సెలక్షన్స్ సోమవారం నిర్వహించారు. నియోజకవర్గ వాలీబాల్ టీమును ఎన్నుకున్నారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పీడీ నగేష్, హాకీ కోచ్ చంద్రశేఖర్, అనంతపురం పీడీ, పిఇటిల అసోసియేషన్ కార్యదర్శి నరసింహారెడ్డి, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పీడీ శ్రీనివాసులు, శింగనమల పాఠశాల పీడీ గోపాల్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

21, 22న వ్యకాసం జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-శింగనమల

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 21, 22వ తేదీన వజ్రకరూరు మండల కేంద్రంలో జరిగే వ్యకాసం 7వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్, మండల కార్యదర్శి సలకంచెరువు సుంకన్న, అధ్యక్షులు తరిమెల రామాంజనేయులు పిలుపునిచ్చారు. సోమవారం మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. వ్యవసాయ కూలీలు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సుంకన్న, కోశాధికారి ఎర్రిస్వామి, నాగేంద్ర ఆంజనేయులు, రామాంజనేయులు, ఆంజనేయులు బాలరాజు, శంకర, రమేష్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.15 వేలు ఆర్థికసాయం

నార్పల : అనారోగ్యంతో బాధపడుతున్న నార్పల మండలం సిద్దరాచర్ల పంచాయతీ కమ్మకొట్టాల గ్రామానికి చెందిన కృష్ణమూర్తి కుమారుడు అప్పనాయుడు వైద్య ఖర్చుల నిమిత్తం టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ఆలం నరసానాయుడు సోమవారం రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ ఆ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహేష్, మదమంచి గంగానాయుడు, మారుతీ, ప్రకాష్ నాయుడు, రవి, మమతా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న ఆలం నరసానాయుడు

KANAKADURGA
FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : రిలయన్స్ డిజిటల్ పైన, 2వ ఫ్లోర్, సుభాష్‌రోడ్డు, క్లాక్‌టవర్ దగ్గర, అనంతపురం.
చలపతి ఎన్‌క్లేవ్, ఫస్ట్‌ఫ్లోర్, పరిగేల్ బస్టాప్ దగ్గర, హిందుపూర్
యాదవ స్ట్రీట్ మెయిన్‌రోడ్డు, సబ్‌జైల్ ఎదురు, ధర్మవరం
రాయదుర్గం :లక్ష్మీబజార్, అనంతపురం మెయిన్‌రోడ్డు, ఎపిజిబి బ్యాంక్ దగ్గర,రాయదుర్గం

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25.11.2022 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 1592.93 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించుకోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంకట తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798

సూపర్‌వైజర్ల నియామక జీవోను రద్దుచేయాలి

ప్రజాశక్తి-గుత్తి

తాత్కాలికంగా అంగన్వాడీ సూపర్‌వైజర్ల నియామక జీవోను ప్రభుత్వం రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు రేష్మ, నాగరాణిలు డిమాండ్ చేశారు. తాత్కాలిక సూపర్‌వైజర్లను నియమిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ గుత్తిలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సిఐటియు అనుబంధ సంస్థ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్వైజర్ల పోస్టుల్లో అక్రమాలు జరిగాయన్నారు. అక్రమాలపై అభ్యర్థులు కోర్టుకు వెళ్లారని చెప్పారు. ప్రభుత్వం తాత్కాలిక నియామకాలను చేపట్టాలని రాత్రికిరాత్రే జీవోలు విడుదల చేయడం అన్యాయమన్నారు. అనంతరం జీవో ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.రామకృష్ణ, సి.రమేష్, ఎస్ఎఫ్ఐ నాయకుడు శివ నాయక్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకులు పద్మావతి, గంగా, మహాలక్ష్మి, బావమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

ఉరవకొండ : ఐసిడిఎస్ పరిధిలో చేపడుతున్న తాత్కాలిక ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్ పోస్టుల నియామకాలను నిలిపివేయాలని ఉరవకొండ డివిజన్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు ధనలక్ష్మి, కార్యదర్శి అశ్వర్థమ్మ డిమాండ్ చేశారు. సోమవారం ఉరవకొండ ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ..కోర్టు తీర్పు రాకముందే ఉరవకొండ ఐసిడిఎస్ పరిధిలో సీనియారిటీతో సంబంధం లేకుండా తాత్కాలిక ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్ల పోస్టుల నియామకాలు చేపట్టడం సరికాదన్నారు. గ్రేడ్2 సూపర్‌వైజర్ పోస్టులకు శాశ్వత ఉద్యోగులను నియమించకుండా అంగన్వాడీల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని అన్నారు. రెగ్యులర్ సూపర్‌వైజర్ల నియామక ప్రక్రియ కోర్టులో ఉన్నందున, కోర్టు తీర్పు వచ్చేవరకు తాత్కాలిక ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్ పోస్టుల నియామకాన్ని నిలిపివేయాలని, ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా పారదర్శకంగా పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఉమారాణికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు దుర్గాదేవి, అంగన్వాడీ కార్యకర్తలు మస్తానమ్మ, రాజమ్మ, లక్ష్మీదేవి, రుద్రమ్మ, రుక్మిణి, సునీత, వరలక్ష్మి, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అంతానికి విద్యార్థులు ముందుండాలి

దిశా డీఎస్పీ ఎ.శ్రీనివాసులు

ప్రజాశక్తి-అనంతపురం

మాట్లాడుతున్న డిఎస్‌పి ఆళ్ల శ్రీనివాసులు

అవినీతిని అంత మొందించడంలో విద్యార్థులు ముందుండాలని దిశా డిఎస్‌పి ఎ.శ్రీనివాసులు సూచించారు. సోమవారం అనంతపురం రీజియన్ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా దిశా డిఎస్‌పి శ్రీనివాసులు హాజరై మాట్లాడుతూ.. భావి భారత పౌరులుగా అవినీతిని అంతమొందించడంలో ముందుండాలని అన్నారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ టి.మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకుని మోసపూరితులు, అవినీతిపరులు ప్రజలను సులభంగా మోసం చేస్తున్నారన్నారు. విద్యార్థులు వారి ఉచ్చులో పడొద్దన్నారు. తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ పిఎల్ఎన్.రెడ్డి, ప్రెసిడెంట్ పివి.రమణారెడ్డి, సెక్రెటరీ డాక్టర్ కె నిర్మలమ్మ హాజరై మాట్లాడారు. అనంతరం కరప్షన్ ఫ్రీ ఇండియా ఫర్ ద డెవలప్‌మెంట్ ఆఫ్ ద నేషన్ అనే అంశం మీద నవంబర్ 3వ తేదీన నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రగతి బ్యాంకు మేనేజర్లు తేజస్, మునాఫ్ జూడోస్, అనంతపురం మేనేజర్ కృష్ణమూర్తి, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నగరూరు రసూల్, విద్యార్థులు పాల్గొన్నారు.

9న 'పివికెకె'లో ప్రాంగణ నియామకాలు

ప్రజాశక్తి -అనంతపురం

స్థానిక రుద్రంపేట సమీపంలోని పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 9వ తేదీన ఇండివిలేజ్ టెక్ సొల్యుషన్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్ బాబు తెలిపారు. 2020, 2021, 2022 సంవత్సరాలలో ఏదైనా డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థినీ విద్యార్థులకు ఇండివిలేజ్ టెక్ సొల్యుషన్స్ సంస్థ ఆధ్వర్యంలో డేటా ప్రాసెసింగ్ అనలిస్ట్ ఉద్యోగాల కోసం ప్రాంగణ నియామకాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులను అనంతపురంలోనే ఉద్యోగులుగా నియమిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు 9వ తేదీ ఉదయం 9 గంటలకు పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలకు తమ సర్టిఫికెట్స్, జిరాక్స్, రెజ్యూమేతో హాజరు కావాలని ప్రాంగణ నియామక అధికారి భాను కిరణ్ తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్, కోశాధికారి పల్లె సింధూర, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి సూచించారు.

సాయిట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నాభిషేకం

ప్రజాశక్తి-అనంతపురం

కార్తీక పౌర్ణమి, కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో తపోవనంలోని షిరిడీ సాయిబాబా దేవాలయంలో అన్నపూర్ణేశ్వరికి ప్రతి సంవత్సరం లాగే సోమవారం అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు వివిధ ప్రాంతాల్లో అన్న ప్రసాదాన్ని పంచి పెట్టారు. సాయంత్రం జ్వాలా తోరణం కార్యక్రమం, దీపోత్సవం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయి సంస్థ ఆధ్యక్షుడు విజయసాయి కుమార్, బ్రహ్మానందరెడ్డి, నాగేశ్వరరావు, నాగరాజు, భానుప్రకాష్, సాయి సంస్థ సిబ్బంది, రాఘవేంద్ర, నారాయణ నాయక్, సాయి భక్తులు పాల్గొన్నారు.

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-ఉరవకొండ రూరల్

కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులిచ్చి ఆదుకోవాలని కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం విడపనకల్ మండలం ఆర్.కొట్టాల గ్రామంలో కౌలు రైతులు సాగుచేసిన పంట పొలాలను ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలరంగయ్య, రంగారెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ రకాల పంటలు సాగు చేసి నష్టపోయిన కౌలు రైతులందరికీ ఎకరాకు రూ.1.30 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విడపనకల్ మండల వ్యాప్తంగా దాదాపు 3000 మందికి పైగా కౌలు రైతులు ఉన్నారన్నారు. అధికారులు మాత్రం కేవలం 210 మంది కౌలు రైతులకు మాత్రమే సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్న మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయన్నారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు నిబంధనల ప్రకారం కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు తిప్పేస్వామి, రైతులు అలివేలమ్మ, హనుమంతు, యువరాజ్, ఉలిగన్న, నారాయణ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు సంఘం మహాసభలను జయప్రదం చేయండి

గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో ఈనెల 21, 22 తేదీలలో జరిగే ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర మూడవ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, కార్యదర్శి బాలరంగయ్య పిలుపునిచ్చారు. సోమవారం విడపనకల్ మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా కిసాన్ సభ అధ్యక్షులు విజ్జుకృష్ణన్ హాజరవుతారన్నారు. కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి సంబంధించిన అంశాలు, భవిష్యత్ కార్యాచరణ గురించి వివరిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కౌలు రైతులందరూ ఈ మహాసభల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

గడపగడపకూ మన ప్రభుత్వం

శింగనమలలో బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. సోమవారం నగరంలోని 16వ డివిజన్‌లో కన్వీనర్ సుకేష్‌తో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ప్రతి ఇంటికీ వివరించారు. బుక్‌లెట్లు అందజేస్తూ స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించారు. అనంతరం ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర సమయం ఉందని, కానీ తాము అమలుచేస్తున్న పథకాలు ప్రజలకు ఎలా చేరువ అవుతున్నాయో తెలుసుకునేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులతో పాటు అధికార యంత్రాంగం కూడా ప్రజల వద్దకు వెళ్లి స్థానిక సమస్యలకు పరిష్కారం చూపుతున్నామన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో రూ.20 లక్షలతో పాటు ఇతర నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రోడ్లు, డ్రెయినేజీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, కమిషనర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శింగనమల : మండల కేంద్రంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను, వాటిద్వారా వారు పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామ్ రెడ్డి, వైసిపి యువ నాయకుడు ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ పట్నం నాగేష్, నరసింహారెడ్డి, సర్పంచి నాగ మునెమ్మ, వైస్ ఎంపీపీ విజయ, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వజ్రకరూరు : వజ్రకరూరు మండల కేంద్రంలోని సచివాలయం-2 పరిధిలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. వాటి ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులకు భూమిపూజ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

భూమిపూజ చేస్తున్న మేయర్ వసీం

పాఠశాల రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా నాడు-నేడు కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని నగర మేయర్ మహమ్మద్ వసీం పేర్కొన్నారు. నగరంలోని 50వ డివిజన్ పరిధిలోని శారదా ప్రాథమిక పాఠశాలలో చేపడుతున్న నాడు-నేడు పనులకు మేయర్ వసీం డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, విజయభాస్కర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ శేఖర్‌బాబులతో కలిసి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నాడు-నేడు కార్యక్రమం ద్వారా శారదా ప్రాథమిక పాఠశాలలో రూ.18 లక్షల వ్యయంతో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని చెప్పారు. త్వరితగతిన పనులు నాణ్యతతో పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జగనన్న మీకు అమ్మ ఒడి స్కూల్ బ్యాగ్, పుస్తకాలు, స్కూల్ యూనిఫాం వంటివి అందిస్తున్నారని, బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సైపుల్లా బేగ్, బాబా ఫక్రుద్దీన్, మాజీ కార్పొరేటర్, బిందుప్రియ, నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై కలెక్టర్ స్పందించాలి

మున్సిపల్ ఛైర్ పర్సన్ డి.వన్నూర్‌బీ

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ

మున్సిపాలిటీ పరిధిలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని, కలెక్టర్ నాగలక్ష్మి స్పందించి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ ఛైర్ పర్సన్ డి.వన్నూర్‌బీ కోరారు. సోమవారం ఆమె ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ గుత్తి మున్సిపాలిటీలోని వివిధ వార్డులకు తాగునీరు సరఫరా చేసే వైటిసి ప్రాజెక్టుకు సంబంధించిన పంపుహౌస్ పామిడిలోని పెన్నానది వద్ద మునిగిపోయిందన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన పైపులు లీకేజీ అవుతున్నాయని చెప్పారు. 75 రోజులుగా తాగునీరు సరఫరా నిలిచిపోయిందన్నారు. శ్రీ సత్యసాయి మంచినీటి పథకం నుంచి వచ్చే తాగునీరు కూడా 20 రోజులుగా నిలిచిపోయిందన్నారు. శ్రీ సత్యసాయి మంచినీటి పథకంలో పనిచేసే కార్మికులకు వేతనాలు రాక వారు సమ్మెలోకి దిగడంతో తాగునీటి సమస్య జఠిలమైందన్నారు. గుక్కెడు నీటి కోసం మున్సిపాలిటీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కలెక్టర్ చొరవ తీసుకొని శ్రీ సత్యసాయి ప్రాజెక్టు మంచినీటి పథకం కార్మికులకు వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఆమె విన్నవించారు.

ఒటిపిఆర్‌ఐ కళాశాల వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

క్యాన్సర్ కారకాలను గుర్తిస్తే నివారణ సాధ్యం

ఒటిపిఆర్‌ఐ డైరెక్టర్ ఆచార్య దుర్గాప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం

క్యాన్సర్ కారకాలను త్వరితగతిన గుర్తించినప్పుడే నివారణ సాధ్యమవుతుందని ఒటిపిఆర్‌ఐ డైరెక్టర్ ఆచార్య దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవ కార్యక్రమాన్నిస్థానిక ఒటిపిఆర్‌ఐ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య బి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. క్యాన్సర్ నిర్ధారణ, చికిత్సల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. క్యాన్సర్ బారిన పడకుండా జీవనశైలిలో మార్పులు అవసరమని తెలిపారు. అనంతరం ఎన్ఎస్ఎస్ విభాగం అధ్వర్యంలో క్యాన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒటిపిఆర్‌ఐ ప్రిన్సిపల్ డాక్టర్ గోపీనాథ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.లింగప్ప, ఎన్ఎస్ఎస్ అధికారి శైలజ, బోధన, బోధనేత సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప

కాటికాపర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-పుట్లూరు

కాటికాపర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. సోమవారం పుట్లూరు మండల కేంద్రంలోని బ్రహ్మంగారి దేవాలయం ఆవరణంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల మొదటి మహాసభను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ..కెవిపిఎస్ ఆవిర్భావం నుంచి దళిత, గిరిజన, మైనార్టీ బిసిలకు అండగా పోరాటం చేస్తోందన్నారు. అనాదిగా శ్మశాన కాటికపర్లుగా ఉన్న వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పింఛను మంజూరుచేయాలని, ప్రమాద బీమా రూ.10 లక్షలు ఇవ్వాలని, కాటికాపర్ల ప్రతి కుటుంబానికి మూడు ఎకరాల భూమి, రెండు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దారు సుమతికి అందజేశారు. అనంతరం కెవిపిఎస్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఓబులాపురం నాగభూషణం, కార్యదర్శిగా రామ్మోహన్, కమిటీ సభ్యులుగా బాలసుబ్బరాయుడు, గంగయ్య, పెద్దిరాజు, శ్రీరాములు, పూజారి రాజు, విష్ణు, నారాయణ తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వీటి రామాంజనేయులు, మండల కార్యదర్శి గుప్త వెంకటచౌదరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి, మండల కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.వెంకటశేఖర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రామాంజనేయులు, సిఐటియు నాయకులు పెద్దయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఉరవకొండ : ఒంగోలులో ఈ నెల 11వ తేదీ జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఉరవకొండ ప్రభుత్వ ఐటిఐ విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ ఎల్.నాగరాజు తెలిపారు. రాష్ట్రస్థాయి ఎంపికైన క్రీడాకారులు డీజిల్ మెకానిక్ ట్రేడ్ శిక్షణ పొందుతున్న విద్యార్థి కె.రవికుమార్, ఫిట్టర్ ట్రేడ్‌లో శిక్షణ పొందుతున్న జీ.షేకప్పను ప్రిన్సిపల్ అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా మంచి ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని, చదువుతున్న కాలేజీకి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి

ఉరవకొండ : ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిద్ధార్థ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెలల 27వ తేదీ నుండి ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. పుస్తకాలు లేకుండా పరీక్షలు ఎలా రాయాలని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. పాఠ్యపుస్తకాలు లేకపోతే విద్యార్థులు చాలా నష్టపోతారన్నారు. వెంటనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉరవకొండ ఎస్ఎఫ్ఐ నాయకులు సింహాద్రి, మహేష్, బన్నీ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బడికి దారి ఏర్పాటు చేయాలని..

ఉరవకొండ : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మోపిడి గ్రామంలోని పాఠశాలకు వెళ్లే దారిలో గుంతలు ఏర్పడి బురదమయంగా మారిందని, ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బడికి వెళ్లేందుకు దారి చూపాలని సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, రైతు సంఘం జిల్లా నాయకులు జ్ఞానమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దారు బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు.

క్రీడా పోటీల్లో 'శ్రీ చైతన్య' ప్రభంజనం

అనంతపురం : అండర్ 14, 17 స్టూడెంట్ ఒలంపిక్ అసోసియేషన్ నేషనల్ మీట్, పంజాబ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో అనంతపురం జిల్లా పాములాయి సమీపంలోని శ్రీ చైతన్య సిబిఎస్ఇ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాల విద్యార్థి జస్వంత్ చౌదరి షటిల్ బ్యాడ్మింటన్‌లో నేషనల్ లెవల్ మొదటి బహుమతి గోల్డ్ మెడల్ సాధించి ఇంటర్నేషనల్ లెవల్‌కి ఎంపికయ్యాడు. బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో లక్షిత్, తరుణ్ కుమార్, శశాంక్, కార్తీక్ రన్నర్స్‌గా నిలిచారు. విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు, షీల్డ్ బహూకరించారు. ఎజిఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ స్వరూప విద్యార్థులకు, పిఇటి రాజుకి అభినందనలు తెలిపారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ స్వరూప తదితరులు